WWW.TELUGUJANASHAKTHI.ORG

తెలుగు


# జనశక్తి

మంగళవారం,23 డిసెంబర్ 2025



..::: తెలుగు జనశక్తి

రాష్ట్రం విభజన జరిగి 12 ఏళ్ల కావస్తోంది. అంటే పుష్కరకాలం గడిచింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సాధించింది సున్నా. ఓ రకంగా చెప్పాలంటే విభజన వల్ల రాజకీయ పార్టీలు, కొందరు నేతలు బాగుపడ్డారు తప్ప ప్రజలు ఏ విషయంలోనూ బాగుపడలేదు. వారికి ఎలాంటి ఉపయోగం కలగలేదు. అయినా రాష్ట్రాలను బాగు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ సవాళ్లు విసురుకుంటూ..జనాలను మోసం చేస్తున్నారు. అక్కడ చంద్రబాబు, జగన్ సవాళ్లు, ఇక్కడ కెసిఆర్ బృందం, రేవంత్ బృందం పరస్పర సవాళ్లతో కాలం గడుపుతున్నారు. తామంతా మంచే చేశామని, పాలన బ్రహ్మాండంగా చేసామని ఇరు రాష్ట్రాల సిఎంలు, సిఎంలుగా పనిచేసిన వారు చెప్పకుంటుటన్నారు. మధ్యలో రాండి చర్చిద్దాం..అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. ఉచిత పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించడం తప్ప వీరు చేసిన పాలనలో గొప్పతనం ఏదీ లేదు. పైగా రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోయాయి.




# సవాళ్లు ఎవరి ప్రయోజనాల కోసం!?

ఇకపోతే తాజాగా కెసిఆర్ మరోమారు మీడియా ముందుకు రావడం, నదీజలాలపై మాట్లాడడం, సర్కార్‌కు సవాల్ విసరడంతో ఇప్పుడు తెలంగాణలో సవాళ్ల పర్వం నడుస్తోంది. కృష్ణా జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్న కాంగ్రెస్ ప్రభుత్వ వాదనగా ఉంది.. కృష్ణా జలాల్లో ఏపీకి 511 టీఎంసీలు (64 శాతం),తెలంగాణకు 299 టీఎంసీలు (36 శాతం) చాలని సంతకం పెట్టింది కేసీఆరే అని, ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసిందీ ఆయనే అని రేవంత్ సర్కార్ విమర్శిస్తోంది. ఆ పాపానికి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు నీటి విషయంలో ఎక్కువ నష్టం జరిగింది. కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం... ఇలా కృష్ణా నదిపై ఉన్న ఒక్క ప్రాజెక్టును కూడా పదేళ్లలో పూర్తిచేయలేకపోయారని విమర్శలు అందుకున్నారు. అసలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఇప్పటివరకు ఎప్పుడేం జరిగింది? ఎవరేం చేశారు? అని చర్చించేందుకు జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతామని, కేసీఆర్ రావాలి. చర్చలో పాల్గొనాలి. ఒకరోజు కృష్ణా జలాల మీద, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దాం అని కూడా రేవంత్ అంటున్నారు. తెలంగాణకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని... అసెంబ్లీకి వస్తే నిలదీస్తామని కూడా సవాల్ విసిరారు. అంతేగాకుండా కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, సభకు వచ్చి చర్చిస్తేనే ఉన్నట్లని వ్యాఖ్యానించారు. రోడ్డు మీద కాదు... అసెంబ్లీలో నీళ్లు-నిజాలపై చర్చిద్దామని సూచించారు. ఇక కెసిఆర్ వ్యవహార శైలి మరోలా ఉంది. కృష్ణాజలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దొంగాటను, రెండేండ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను కేసీఆర్ ఏకరువు పెట్టారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య అన్నారు.ప్రజలను ఏమార్చినంత సులువుగా పాలన చేయడం చేతిగాని విఫల నేత అని పరోక్షంగా రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ఇంతకాలం నోరు తెరిస్తే చావు శకునాలు, నెత్తుటి కూతలు కూసిన బేతాళ మాటలను కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై రెండేండ్ల నుంచి నేను మౌనం పాటించి చూసుకుంటూ వస్తున్నట్లు వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు నేను బయలుదేరాను. ప్రజల మధ్యలో అటు కేంద్రాన్ని ఎక్స్‌పోజ్ చేస్తం. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా ఎండగడుతం. చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతం అని ప్రకటించారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన సభలు పెడుతం. ప్రజా ఉద్యమాలు చేస్తం. పెద్ద బహిరంగ సభలు పెడుతం. బహిరంగ సభలకు నేను స్వయంగా అటెండ్ అవుతున్నా. ప్రజాక్షేత్రంలో ఈ ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఎండగడుతం అని కేసీఆర్ ప్రకటించారు.మా హయాంలో ఈ రాష్ట్రం ఒక పద్ధతి ప్రకారం ముందుకు నడిచింది. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికం, ఐటీ రంగం, క్రైమ్ తగ్గింపు, లాండ్ అండ్ ఆర్డర్ నిర్వహణలో మంచి పద్ధతిలో ముందుకు పోయింది. ఇప్పుడు మానభంగాలు, నడి రోడ్డుపై హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కులేదు. అప్పుడు పీస్ ఫుల్ స్టేట్ ఉండె.. ఇప్పుడవన్నీ మాయమైనయని అన్నారు. యూరియా సప్లయ్ చేసే తెలివి లేదా వీళ్లకు? మా గవర్నమెంట్ ఉన్నప్పుడు రైతులు ఆటోకు డబ్బులిచ్చి పది బస్తాలు తెచ్చియ్యి బాబూ అంటే.. తెచ్చి ఎకడో పొలంకాడ పడేస్తుండె. ఇవ్వాల రైతులు రోజుల తరబడి లైన్లలో చెప్పులు పెడుతున్నరు. రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పుల లైన్లు ఉండె. బీఆర్ఎస్ ఉన్నన్ని రోజులు చెప్పుల లైన్లు మాయమైనయ్. కాంగ్రెస్ రాగానే మళ్లీ చెప్పుల లైన్లు స్టార్ట్ అయినయ్ అంటూ విమర్శలు సంధించారు. ఎంతసేపు రియల్ ఎస్టేట్ దందా తప్ప పాలమూరుకు రెండేండ్ల నుంచి రూపాయి పెట్టలేదు. తట్టెడు మట్టి తీయలేదు. వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నది? ఎవరి ప్రయోజనాలు కోరుతున్నట్టు అని నిలదీసారు. 10 టీఎంసీలకు మా గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ పంపింది. ఇప్పుడేమో ఆ డీపీఆర్ తిప్పి పంపించిండ్రు.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, రాష్ట్రానికి వస్తున్న నీళ్లను కూడా కాపాడే పరిస్థితి లేకపోతే.. ఇదేం దద్దమ్మ ప్రభుత్వం? కేంద్రం మొత్తం డీపీఆర్ పంపిస్తే ప్రాజెక్టుని ఆగం చేసే పరిస్థితి వస్తే.. వీళ్ల నుంచి సప్పుడులేదంటూ కెసిఆర్ తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. మొత్తానికి ఇప్పుడు పరస్పర సవాళ్లు తప్ప పాలనపై ఎలాంటి సూచనలు లేవు. మధ్యలో ప్రజలు ఆగమవుతున్నారు. రాష్ట్రం అప్పులపాలు అవుతోంది. ఇదంతా నాయకత్వ లోపంగానే చూడాలి.

***ఇందులో గతంలో పాలించిన, ఇప్పుడు పాలిస్తున్న వారే బాధ్యులు. అప్పుల గురించి చర్చించాలి. నీటి వాటాలపైనా చర్చించాలి. అయితే మేధావుల సమక్షంలో అసెంబ్లీ బయట చర్చిస్తే మంచిది.***

..::: తెలుగు జనశక్తి

WWW.TELUGUJANASHAKTHI.ORG